
సాక్షి
పల్నాడు
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



నూకలమ్మ విగ్రహ ప్రతిష్ట

తెనాలిఅర్బన్: ముత్తెంశెట్టిపాలెంలోని శ్రీ నూకలమ్మతల్లి దేవస్థానంలో సోమవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటి మట్టం సోమవారం 509.00 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,882, ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.6800, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.



న్యూస్‌రీల్

శోభా రథయాత్రను విజయవంతం చేయాలి



పట్నంబజారు: శ్రీరామనవమిని పురస్కరించుకుని చేపట్టనున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని శ్రీరామ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు కారంశెట్టి లోకేష్ కోరారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. ఆరేళ్లుగా శోభా రథయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలందరికీ శ్రీరాముని ఆశీస్సులు అందజేసే విధంగా యాత్ర కొనసాగుతోందని తెలిపారు. యాత్రలో గుంటూరు జిల్లాకు సంబంధించి రామభక్తులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఉదయం 9.11 గంటలకు శోభా రథయాత్ర ప్రారంభమవుతోందని, ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ కృష్ణమోహన్, పలువురు ప్రజాప్రతినిధులు, పెద్దలు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు బ్రహ్మారెడ్డి, తియ్య వేణుగోపాల్(హిందూ), అడపా ఫణీంద్ర, తూనుగుంట్ల రాజేష్, సాయి, మధు, రాజేష్, ప్రవీణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

అదనపు జిల్లా జడ్జిగా ఎన్. సత్యశ్రీ

నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా ఎన్. సత్యశ్రీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లూరు అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన న్యాయమూర్తి ఓ. వెంకట నాగేశ్వరరావు రిటైర్ అయ్యారు. ఖాళీగా ఉన్న స్థానంలో సత్యశ్రీ నియమితులయ్యారు.

11న జాతీయ లోక్ అదాలత్

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 11న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్ కేసుల్ని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కక్షిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

యార్డులో 1,32,603 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,32,603 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,22,620 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 84,395 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.76 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.2.76 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 19 రోజులకు గాను హుండీల ద్వారా రూ.2,76,11,524 నగదు, 478 గ్రాముల బంగారం, 4.830 కిలోల వెండి లభ్యమైంది. కానుకలు, హుండీల లెక్కింపును ఆలయ ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షించగా, ఆలయ, సేవా సిబ్బంది పాల్గొన్నారు. ఈ హుండీల ద్వారా రూ.70,541 విరాళాలను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి సమర్పించారు. హుండీలలో నగదుతో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీని భక్తులు కానుకలుగా సమర్పించారు. యూఎస్‌ఏకు చెందిన 1451 డాలర్లు, ఇంగ్లాండ్‌కు చెందిన 110 పౌండ్లు, కెనడాకు చెందిన 85 డాలర్లు, యూఏఈకి చెందిన 110 దిర్హామ్స్‌లతో పాటు ఇతర దేశాలకు చెందిన కరెన్సీ లభించింది.

డిజిటల్ ఎన్నికళ మోత



- గతంలో గోడల మీద పోస్టర్లు, వీధుల్లో మైకులతో ప్రచారాలు
- ప్రస్తుతం ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాంలలో వీడియోలు
- ఓటర్లను ప్రభావితం చేసేలా నిర్మాణం
- సోషల్ మీడియా వేదికగా విమర్శలు, ప్రతి విమర్శలు

సాక్షి, నరసరావుపేట: మారుతున్న కాలంతోపాటు నేడు రాజకీయ ప్రచారాలు మారాయి. గతంలో పోస్టర్లు, మైకులకే పరిమితమైన నేతల ప్రచారం నేడు సోషల్ మీడియాకు ఎక్కింది. గతంలో ఇంటింటికీ తిరుగుతూ, గోడల మీద పోస్టర్లు వేసి, రోడ్లపై పెద్ద మైక్‌సెట్లతో పదుల సంఖ్యలో వాహనాలతో ఓ వేడుకలా సాగేది. నేడు ట్రెండ్ మారింది. తమ పార్టీ సిద్ధాంతాలు, విజయాలు, ప్రతిపక్షం లోపాలు ప్రతి ఓటరుకూ చేరేలా డిజిటల్ విప్లవాన్ని సమర్థంగా వినియోగించుకుంటున్నారు. సోషల్ మీడియా వేదికగా ఒక్క పోస్టుతో లక్షల మందికి చేరేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల నేతలు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగాం తదితర సోషల్‌మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్స్‌ను సంపాదించి తమ వాదనను వినిపిస్తున్నారు.

కామెంట్లు.. కౌంటర్లు..



ప్రస్తుతం మన రాష్ట్రంలో, నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి ఎవరు? అని ఫేస్‌బుక్‌లో పోస్టు పెడుతూ వివిధ పార్టీల అభ్యర్థుల ఫొటోలు పెడుతున్నారు. వాటికి ఫాలోవర్లు విపరీతంగా స్పందిస్తున్నారు. కామెంట్లు, కౌంటర్లు పెడుతున్నారు. తమ పార్టీ అభ్యర్థి గుణగణాలు, ఎదుటివాళ్ల లోపాలనూ చెబుతూ తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఐదేళ్ల కిందట ఇలా ఉండేది...ఇప్పుడు ఇదిగో ఇలా మార్చాం... ఈ ఘనత మా అభ్యర్థిదే.. ఇలాంటివి ఎన్నో వేశాం.. ఇకముందు మరెన్నో చేస్తాం.. ఇప్పటికైనా అభివృద్ధికి చేయూతనివ్వండి అంటూ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా వివాదాస్పద అంశాలు పోస్టు చేయడంతో ఇరుపార్టీలు, వర్గాల మధ్య వివాదాలకు దారితీస్తున్న సందర్భాలు లేకపోలేదు.

వైఎస్సార్ సీపీ జోష్



ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనపై ఆకర్షితులైన యువత ఎక్కువగా సోషల్ మీడియాలో వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేస్తున్నారు. స్టార్ క్యాంపెయినర్స్ పేరిట జగన్ పాలనపై సామాన్యులు గుండెలకు హత్తుకునేలా ఉన్న చిన్న నిడివి వీడియోలు వైరల్ అవుతున్నాయి. సిద్ధం సభల పేరిట చరిత్ర సృష్టించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల శంఖారావం సభల వీడియోలు సైతం దేశ వ్యాప్తంగా ట్రెండింగ్‌లో మొదటి స్థానంలో నిలిచాయి. దీంతో వైఎస్సార్ సీపీ కొత్త రికార్డులను సృష్టించింది. మరోవైపు తెలుగుదేశం పార్టీ తన అనుకూల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలను వినియోగించుకుంటోంది.

ప్రోత్సహిస్తున్న పార్టీలు



2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకుని లాభపడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి దేశ రాజకీయాల్లో దీని పాత్ర గణనీయంగా పెరిగింది. ఈ పరిణామాలను గమనించిన మిగతా పార్టీల నేతలంతా ఎన్నికల్లో డిజిటల్ ప్రచారం కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. పార్టీలోని నాయకులు కూడా సోషల్ మీడియాలో ప్రచారం కోసం యువ కార్యకర్తలను ఐటీ వింగ్ పేరిట ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నారు. తమ నాయకుల సభలు, సమావేశాల్లో ప్రసంగిస్తున్న దృశ్యాలను ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు



ఈవీఎంల పనితీరు గురించి వివరిస్తున్న జిల్లా కలెక్టర్

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్
- టౌన్ హాలులో నరసరావుపేట నియోజకవర్గ ఎన్నికల అధికారులకు శిక్షణ

నరసరావుపేట: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పీవోలు, ఏపీవోలు, సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ సూచించారు. స్థానిక భువనచంద్ర టౌన్ హాలులో సోమవారం సాధారణ ఎన్నికలపై నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణలో ఆయన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో శిక్షణ కార్యక్రమాలు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో పీవోలు, ఏపీవోల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. శిక్షణలో అందించే ప్రతి అంశంపై పూర్తి వివరాలు తెలుసుకొని స్పష్టంగా ఉండాలన్నారు. పొరపాట్లకు తావివ్వకుండా విధుల్ని నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ అందజేసిన పీపీటీ-హ్యాండ్ బుక్ పూర్తిగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. ఈవీఎం మిషన్లలో బాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్, కంట్రోల్ యూనిట్ అనుసంధాన ప్రక్రియ, పోలింగ్ డే రోజు మాక్ పోల్ ప్రక్రియ, ముఖ్యంగా పలు పత్రాలు నింపే విధానం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. ఇది వరకు ఎన్నో ఎలక్షన్ విధులు చేశాం అనే నిర్లక్ష్యం చూపవద్దని, ప్రతి సారి ఈసీఐ నూతన మార్గదర్శకాలు రూపొందిస్తుందని కలెక్టర్ వివరించారు. సందేహాల్ని పై అధికారుల్ని అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం ఆపరేట్ చేయడం, ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలు, ప్రీ పోల్, పోలింగ్ తర్వాత చేయాల్సిన పనులు, నిబంధనల్ని సంపూర్ణంగా వివరించారు. ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సినవి, చేయకూడనివి స్పష్టంగా కలెక్టర్ వివరించారు.

సీఎం జగన్‌పై హత్యాయత్నం ప్రజాస్వామ్యంపై దాడి

నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ప్రజాస్వామ్య వ్యవస్థపై నెత్తుటి మచ్చలాంటిదని ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ సోమవారం పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎన్నో మంచి పనులు చేసి, మళ్లీ ఒక అవకాశం కల్పించాలని కోరుతూ ప్రజల మధ్యకు వెళ్లిన జగన్‌పై దాడి చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఆయనకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేని వ్యక్తులే ఈ పనికి పూనుకున్నారని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మళ్లీ అధికారంలోకి వచ్చేది సీఎం జగన్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి

ఎస్పీ జి. బిందుమాధవ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ

రొంపిచర్ల: ప్రశాంత పోలింగ్‌కు గ్రామస్తులంతా సహకరించాలని జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ కోరారు. మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలైన అలవాల, గోగులపాడు, నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, యలమంద, రావిపాడు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని ఎస్పీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్ని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలుగా విభజించి అక్కడి బందోబస్తు అవసరాలకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. రొంపిచర్ల మండలంలోని అలవాల, గోగులపాడు గ్రామాలు, నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, యలమంద, రావిపాడు గ్రామాలను అత్యంత సమస్యాత్మక జాబితాలో చేర్చామని పేర్కొన్నారు. ఈ గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడి, ఎన్నికల నియమావళిని వివరించారు. ఎవరైనా దాన్ని ఉల్లంఘిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగితే సమస్యాత్మక గ్రామాల జాబితా నుంచి ఆ గ్రామాన్ని తొలగిస్తామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వర్మ, సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ కె.పి. రవీంద్ర ఉన్నారు.

రాయితో కొడితే ఓట్లతో కొడతారు



పీఆర్కేకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: జగనన్నకు జనం నుంచి వస్తున్న స్పందనను చూసి కూటమి నాయకులు తట్టుకోలేక రాళ్ల దాడులకు పాల్పడుతున్నారని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు.మండలంలోని తాళ్లపల్లిలో సోమవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికలలో ఒక్కడిగా గెలవలేక దత్త పుత్రుడిని, బీజేపీని తోడు చేసుకుని కూటమిగా ఏర్పడినా ప్రజల నుంచి స్పందన రావడం లేదని తెలిపారు. టీడీపీని సీట్లు కోసం, ఓట్లు కోసం నాయకుల్ని తాకట్టు పెట్టిన చరిత్ర చంద్రబాబుదని విమర్శించారు. జగనన్నకు రాష్ట్ర ప్రజల రక్షణ ఉంటుందని, ఆయన సంక్షేమ అభివృద్ధే శ్రీరామరక్షగా నిలుస్తుందని తెలిపారు. ఆయన్ను ఎదుర్కోవాలంటే చంద్రబాబు మరో జన్మ ఎత్తాలన్నారు. జగనన్నకు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేక రాయితో దాడి చేస్తే.. మిమ్మల్ని ప్రజలు మే 13న జరగనున్న ఓటుతో కొట్టనున్నారు జాగ్రత్త ! అని పీఆర్కే హెచ్చరించారు. ఇక్కడ ఉన్నది జగన్ అని గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. వలంటీర్లను పనికిమాలిన వారని, మూటలు మోసేవారని హేళన చేసిన చంద్రబాబు ఎన్నికలొచ్చేసరికి రూ.10వేలు జీతాలిస్తామని మాయమాటలు చెప్పడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం 1.50లక్షల మందికి సచివాలయ ఉద్యోగాలు, 2.50లక్షల మందికి వలంటీర్ల ఉద్యోగాలు, 60వేల మందికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారని వివరించారు. ప్రతి పంచాయతీకి రూ. 10కోట్ల అందించారన్నారు. గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా, వైఎస్సార్ క్లినిక్‌లతో పాటు రహదారులు, కాలువలు నిర్మించి ప్రతి ఒక కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. జగనన్నకు మరొకసారి అండగా ఉండి సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందామని పీఆర్కే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ యంగ్ర గాలయ్య, మాజీ సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, యాదవ, పెరిక, కాపు, ముదిరాజ్, వడ్డెర సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

బాబుకు బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధం

- చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆర్భాటపు మాటలను నమ్మవద్దు
- బంగారు వర్తకుల ఆత్మీయ సమావేశంలో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్. వేదికపై డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: ఓటర్లంతా వైఎస్సార్ సీపీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఇప్పటికే నిర్ణయించుకున్నారని పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. కాకుమాను బజారులోని జీవీఎల్‌ఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం నరసరావుపేట వెండి, బంగారు, డైమండ్స్ నగల వర్తక సంఘ ఆధ్వర్యంలో వ్యాపారులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గత రెండు పర్యాయాలు నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా పనిచేశానని, వ్యాపారులకు చేతనైనంత సాయం చేయడమే గానీ ఏనాడు హానికరంగా వ్యవహరించలేదని తెలిపారు. పార్లమెంటు సభ్యుడిగా గెలిపిస్తే వ్యాపారాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ స్థానికంగా తాను పార్టీలకు అతీతంగా వ్యాపారులకు సహాయ, సహకారాలు అందజేశానని పేర్కొన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు కంటే ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వల్లే ప్రయోజనం చేకూరిందని చెప్పారు. చంద్రబాబు తానే సెల్‌ఫోన్ తీసుకొచ్చానని, ఒలింపిక్స్ ఆటల పోటీలు అమరావతిలో నిర్వహిస్తానని బూటకపు మాటలతో ప్రజల్ని మాయ చేసేందుకు ప్రయత్నించాడని విమర్శించారు. వలంటీర్ల వ్యవస్థను తిట్టిన బాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు దాన్ని కొనసాగిస్తామని, ప్రతినెలా రూ.10వేలు జీతం చెల్లిస్తామని చెబుతున్నారన్నారు. 2014లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి పోటీచేసి అధికారంలోకి వచ్చిన బాబు 2019 నాటికి ఆయన్ను తిట్టాడని, మళ్లీ ఇప్పుడు పొగుడుతున్నాడని విమర్శించారు. ఇటువంటి వ్యక్తులకు అధికారం ఇవ్వడం ప్రమాదకరమనే విషయం ప్రజలు గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహనరెడ్డి మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీకి అందరూ ఓటువేసి తమను ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం ఇద్దరు నేతలను సంఘ ప్రతినిధులు దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంటు అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గొడవర్తి చంద్రశేఖర్, కాపులపల్లి ఆదిరెడ్డి, కొమ్మసాని కమలాకరరెడ్డి పాల్గొన్నారు.

గుండెకు భరోసా

- గుంటూరు జీజీహెచ్‌లో 24గంటలు క్యాథ్‌ల్యాబ్ వైద్యసేవలు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం
- అందుబాటులో మెదడు, కాళ్ల రక్తనాళాల పూడిక వైద్యం



క్యాథ్‌ల్యాబ్ మిషన్

గుంటూరు మెడికల్: హార్ట్ స్ట్రోక్ వస్తే ప్రాణాలు గాల్లో కలిసి పోతాయి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు చిన్న వయస్సులో కూడా వస్తోందని కార్డియాలజిస్టులు తెలియజేస్తున్నారు. పగలు, రాత్రి, తెల్లవారుజామున ఇలా ఏ సమయంలో వస్తుందో ఎవ్వరూ ముందస్తుగా ఊహించి చెప్పలేని పరిస్థితి. హార్ట్ స్ట్రోక్ ఏ సమయంలో వచ్చినా మేము మీకు 24 గంటలు అందుబాటులో ఉండి మీ గుండెకు భరోసా కల్పిస్తామంటూ గుంటూరు జీజీహెచ్ కార్డియాలజిస్టులు అభయమిస్తున్నారు.

పూర్తి ఉచితంగా గుండె ఆపరేషన్లు

గుంటూరు జీజీహెచ్‌లో గుండెజబ్బు రోగులకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రోగులకు కార్డియాలజీ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా క్యాథ్‌ల్యాబ్ వైద్యసేలను అందిస్తున్నారు. గుండె జబ్బుల వైద్య విభాగంలో 24 గంటలు క్యాథ్‌ల్యాబ్ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయి. గుండెపోటు వచ్చిన వారికి త్వరగా యాంజియోగ్రామ్ చేసి వ్యాధి నిర్ధారణ చేయడం ద్వారా సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడవచ్చని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

24 గంటలు క్యాథ్‌ల్యాబ్ సేవలు

కార్డియాలజీ క్యాథ్‌ల్యాబ్ వైద్య విభాగంలో గుండె జబ్బురోగులకు 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. అనుక్షణం కార్డియాలజిస్టులు, కార్డియాలజీ పీజీ వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. వైద్యులతో పాటుగా నర్సింగ్ సిబ్బంది, ఇతర పారామెడికల్ సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండి రోగులకు సత్వరమే మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారు.

కేంద్ర ప్రాజెక్టులో భాగంగా క్యాథ్‌ల్యాబ్ మిషన్ ఏర్పాటు

విజయవాడకు చెందిన లక్ష్మీఆరుష్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్(పీపీపీ) విధానంలో జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్ మిషన్ ఏర్పాటు చేసింది. నీతి ఆయోగ్ ప్రాజెక్టులో భాగంగా ఏపీలో క్యాథ్‌ల్యాబ్‌ను మొట్టమొదట గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధి, కార్డియాలజిస్ట్ డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య తెలిపారు. సుమారు రూ.4.5 కోట్లతో ఏర్పాటుచేసిన ఆధునిక క్యాథ్‌ల్యాబ్‌తో 50శాతం రేడియేషన్ తక్కువగా ఉంటుందన్నారు. క్లియర్ స్టంట్ విధానం ద్వారా స్టంట్ వేసే సమయంలోనే కచ్చితమైన ప్రదేశంలో అమర్చే సౌకర్యం నూతన క్యాథ్ ల్యాబ్‌లో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

2018 డిసెంబర్‌లో జీజీహెచ్‌లో ఫిలిప్స్ కంపెనీకి చెందిన అజురియన్ 7.సి అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ మిషన్‌ను నూతనంగా ప్రారంభించారు. 2019లో 3,926 మందికి, 2020లో 2,885 మందికి, 2021లో 899 మందికి, 2022లో 1,580 మందికి, 2023లో 1,670 మందికి, 2024 మార్చి నెల వరకు 250 మంది గుండెజబ్బు రోగులకు యాంజియోగ్రామ్‌లు చేసి అవసరమైన వారికి స్టంట్‌లు వేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్ కార్డు ఉన్న వారితోపాటుగా ఏ కార్డు లేని వారికి కూడా ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారు.



క్లుప్తంగా

సీఎంపై దాడి అప్రజాస్వామికం

వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం నేతలు



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై మేమంతా సిద్ధం బస్సు యాత్రలో విజయవాడలో దాడి అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై షేక్ చెప్పారు. కొత్తపేటలోని వారి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్ధం యాత్రలో కొంత మంది ఆగంతకులు రాయితో దాడి చేసి సీఎం వై.ఎస్.జగన్‌ను గాయపరచడం ఎంతో దుర్మార్గమైన చర్య అన్నారు. నిందితులు ఎంతటివారైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్స్ విభాగం ఉపాధ్యక్షులు బాలకృష్ణ, కోటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక దాడి చేయించారని మండి పడ్డారు. ప్రజాసంక్షేమం కోసం పాటుపడుతున్న ఆయనకు దేవుడు, ప్రజల ఆశీస్సులు ఉంటాయన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి



లక్ష్మీపురం: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ తన చివరి శ్వాస వరకు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం కార్యాలయంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి అవిశ్రాంతంగా తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. డివిజన్ ఏడీఆర్‌ఎం కె.సైమాన్ మాట్లాడుతూ ఆయన కేవలం విద్యావేత్త మాత్రమే కాదు, ఆర్థిక, రాజకీయ వేత్త, సంఘ సంస్కర్త మహిళలు కార్మిక హక్కుల కోసం పోరాడే వారని అన్నారు. అనంతరం సీనియర్ డీఈఎస్ ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కె.కమలాకర్‌బాబు, సీనియర్ డీపీఓ షేక్ షాహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి గల్లా మాధవిపై ఈఆర్వోకు ఫిర్యాదు

నెహ్రూ నగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం నాయకుడు పిల్లుట్ల బాబూరావు ఫిర్యాదు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మికి సోమవారం ఫిర్యాదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన సాయంత్రం టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, ముత్యాలరెడ్డి నగర్‌లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారని, ఆ సమయంలో ఆ ప్రాంతమంతా తీన్మార్ తప్పెట్లతో అలజడి సృష్టించారని పేర్కొన్నారు. బాణసంచా పేలుళ్లు యథేచ్ఛగా కొనసాగించారని తెలిపారు. ఇవన్నీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి మాధవిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మా అబ్బాయిని గెలిపించండి !

పీఆర్కే విజయం కోరుతూ తల్లి రాములమ్మ ప్రచారం



కాచవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్కే మాతృమూర్తి రాములమ్మ

కారెంపూడి : మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన మాతృమూర్తి పిన్నెల్లి రాములమ్మ, చెల్లెలు జవ్వాజి నాగమణి మండలంలోని కాచవరంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని రాములవారి గుడిలో ప్రత్యేక పూజల అనంతరం ప్రతి గడపకూ వెళ్లారు. ఆ కుటుంబాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన కుమారుడు రామకృష్ణారెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మించి ఇంకా మంచి చేస్తారని వివరించారు. తన కుమారుడు రామకృష్ణారెడ్డి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నాడని పీఆర్కే తల్లి రాములమ్మ వివరించారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆశీర్వదించాలని కోరారు. జగనన్న ఇస్తున్న పింఛన్లతో పాటు ఇతర పథకాల వల్ల తమ జీవితం సక్రమంగా సాగుతోందని పలువురు రాములమ్మకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం,ఎంపీపీ బొమ్మిన సావిత్రి, వైఎస్సార్ సీపీ మండల మహిళా కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ, గ్రామ సర్పంచ్ నవులూరి లక్ష్మయ్య, పార్టీ గ్రామ నాయకులు క్రిష్టపాటి అంకిరెడ్డి, దిబ్బమడుగు వెంకటరమణ, దిబ్బమడుగు కృష్ణమూర్తి, తెప్పాల వెంకట్రామిరెడ్డి, తిరుపతిరెడ్డి, వెన్నపూస జగన్‌మోహన్‌రెడ్డి, జక్కిరెడ్డి నాగిరెడ్డి, పులిచర్ల హనుమంతరెడ్డి, బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రచారం కోసమే 'కన్నా' కండువాల కార్యక్రమం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పార్టీలో చేరిన దమ్మాలపాడు వాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: దారిన పోయే వాళ్లందరికీ, కనిపించిన వాళ్లందరికీ వారి సమ్మతి లేకపోయినా కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పచ్చ కండువాలు కప్పుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. టీడీపీలో చేరికలు ఎక్కువవుతున్నాయనే ఆర్భాటపు ప్రచారం కోసమే ఆయన కండువాల కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజవర్గ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ చేరికల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన మహబూబ్ సుభాని, నాగుల్ మీరా, హసన్ బాషాలు మొదటి నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలే. అయితే, స్థానిక టీడీపీ నాయకులు ఒత్తిడి చేసి పార్టీలో చేర్పించారు. మరలా ఆదివారం కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో పచ్చ కండువాలు వేసుకున్నారు. అయితే, తర్వాత వారికి నిద్ర పట్టలేదని, మనసులో ఏదో అసంతృప్తిగా ఉందని సదరు కార్యకర్తలు దమ్మాలపాడులోని వైఎస్సార్ సీపీ నాయకుల్ని సంప్రదించారు. తిరిగి వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతామని తెలిపారు. వారిని మంత్రి అంబటి రాంబాబు సమక్షంలోకి తీసుకురాగా 'మీరు మన పార్టీ వారే కదా.. మీకు కండువాలు ఎందుకని?' ఆయన ప్రశ్నించగా... లేదండి పచ్చ కండవా కప్పుకొని అపవిత్రులమయ్యాం.. మళ్లీ మన పార్టీ జగనన్న కండువా వేసుకొని పవిత్రులం కావాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఆయన సంతోషంతో వైఎస్సార్ సీపీ కండువాలను కప్పి తిరిగి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారికి అభినందనలు తెలియజేశారు. మొహమాటానికి ఎక్కడికి పోవద్దని, హృదయపూర్వకంగా పార్టీకి కష్టపడి పని చేయాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ కళ్లం శివరామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, స్థానిక నాయకుల సుధాకర్‌రెడ్డి, బుడే, మాదల నాయకుల సైదా, బాజీ పాల్గొన్నారు.

బీసీలకు బ్యాక్ బోన్ వైఎస్సార్ సీపీ

బీసీ ఆత్మీయ సదస్సులో కృష్ణయ్య



వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కృష్ణయ్య, ఉదయభాను, ఎమ్మెల్సీలు

జగ్గయ్యపేట: బీసీలకు బ్యాక్‌బోన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. పట్టణంలోని ఎస్‌జీఎస్ కళాశాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ బీసీ ఆత్మీయ సదస్సు సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని చెప్పారు. చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. చంద్రబాబు ప్రజలను ఓటర్లుగా చూస్తారని, జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులుగా చూస్తారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ వంటి గొప్ప నాయకుడు కావాలంటూ కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే ఉదయభానును గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీల వర్గాలతో పాటు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదేళ్లలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా ఎన్నడూ లేని విధంగా బీసీలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మాటల సీఎం కాదని, చేతల సీఎం అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసే తాను పోలీస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాలలోకి వచ్చానన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు సిద్దవటం యానాదయ్య మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులను కించపరిచిన చంద్రబాబును రానున్న ఎన్నికలలో మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా నిరుపేదలకు మేలు జరిగిందన్నారు. అనంతరం ఆర్.కృష్ణయ్య, ఉదయభానును బీసీ సెల్ నాయకులు సత్కరించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి, వడ్డెర, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌లు జింకా విజయలక్ష్మీ, దేవళ్ల రేవతి, తొండమళ్ల పుల్లయ్య, పార్టీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేబీరాణి, ముదిరాజ్ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు పిల్లి రామారావు, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, నియోకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, ఫైనాన్స్, పూసల, మైనింగ్ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు విజిత, కుమారి, రామారావు, విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను, నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు పెంటి శ్రీనివాసరావు, శ్రీనివాస గౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేము సైతం ప్రచారానికి సై



పట్టణంలో ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ల బృందం

వైఎస్సార్ సీపీ డాక్టర్ల బృందం ఇంటింటికీ ప్రచారం

నరసరావుపేట: సంక్షేమం, అభివృద్ధి కలిపిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కావాలో.. మాయమాటలు చెప్పే నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం కావాలో ఓటర్లు నిర్ణయించుకోవాలని వైఎస్సార్ సీపీ డాక్టర్లు పేర్కొన్నారు. సోమవారం పార్టీ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులైన డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని 16వ వార్డు శ్రీరాంపురంలో 40మంది డాక్టర్ల బృందం మేమంతా సిద్ధమంటూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్ పేదలు, మధ్యతరగతి వర్గాలకు ఇంటికే సంక్షేమ పథకాలు అందజేశారని తెలిపారు. ప్రజలు కూడా ఇంటికే పథకాలు తీసుకొచ్చే వలంటీరు వ్యవస్థ కావాలో, వేధించే జన్మభూమి కమిటీలు కావాలో తేల్చుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ పొలూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలు మళ్లీ కావాలనుకుంటే ఓటర్లు అందరూ ఆయనకే మద్దతు తెలపాలని కోరారు. డాక్టర్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తామంతా పట్టణంలోని 34వార్డులు తిరుగుతామని చెప్పారు. గత రెండు ఎన్నికల్లో ప్రచారం చేశామని, పట్టణంలో మంచి మెజార్టీ వచ్చిందని తెలిపారు. ఈసారి కూడా వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ఏవీపీ రామలింగారెడ్డి, జిల్లా రెడ్‌క్రాసు అధ్యక్షులు డాక్టర్ కేజే మోహనరెడ్డి, పలువురు మహిళా డాక్టర్లతో పాటు 16వ వార్డు ఇన్‌చార్జి వి.సాంబశివరావు, నరసరావుపేట చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షులు చీతిరాల గురుపెద్దన్న, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పర్చూరు (చినగంజాం): ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం పర్చూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన రావి విజయభాస్కర్ (47) పర్చూరు నుంచి ద్విచక్రవాహనంపై తన గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ మహిళ లిఫ్టు అడగడంతో ఆమెను ఎక్కించుకున్నాడు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో వారిరువురిని చికిత్స నిమిత్తం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ విజయభాస్కర్ మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడ్డ మహిళకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

సీఎం జగన్‌ను తుదముట్టించేందుకే హత్యాయత్నం



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: ప్రజాదరణను చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని పథకం ప్రకారం తుదముట్టించేందుకే హత్యాయత్నం చేశారని సీనియర్ లాయర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కూటమి దుర్మార్గంగా వ్యవహరిస్తూ జగన్‌పై చేసిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంకాళ్ల వెంకటేశ్వర్లు, జూపల్లి శేషయ్య, కాశిమాల మార్క్ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ చిన్నం మణిబాబు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, న్యాయవాదులు సయ్యద్ అబ్దుల్ రహీం, వి.కృష్ణారెడ్డి, ఉడుముల విద్యాసాగర్‌రెడ్డి, పోతల రవికుమార్, రాజవరపు నరసింహారావు, బూతుకూరి రామిరెడ్డి, ఏడుకొండలు, పోతూరి హరీష్, ఆకుల నాగార్జున, బాదినీడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నతోనే భరోసా...



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని

- ప్రజలు నమ్ముతున్నది వైఎస్సార్ సీపీనే చెప్పింది చెప్పినట్లుగా చేసే నాయకుడు జగనన్న ఒక్కడే
- గుంటూరు పశ్చిమలో జయకేతనం ఎగురవేస్తాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ నుంచి 60 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

పట్నంబజారు: 'మీ ఇంట్లో మంచి జరిగితేనే.. ఓటు వేయండమ్మ..' లేకపోతే వద్దని చెప్పే ధైర్యం రాష్ట్ర రాజకీయాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తప్ప మరెవరికి లేదని, ఆయనతోనే రాష్ట్ర భవిష్యత్ మంచిగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, పార్టీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని చెప్పారు. చంద్రమౌళినగర్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ నుంచి పార్టీలోకి 60 కుటుంబాలు సోమవారం చేరాయి. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి టీడీపీకి చెందిన 30 కుటుంబాలు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు ఝాన్సీ ఆధ్వర్యంలో కన్నావారితోట నుంచి 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి రజిని మాట్లాడుతూ సంక్షేమం అందాలంటే జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలనే నిర్ణయానికి ప్రజలు వచ్చేశారని తెలిపారు. చరిత్ర ఎరుగని సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్న ఖ్యాతి జగనన్నకే దక్కిందని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. గత ఎన్నికలకు ముందు ఏ హామీలు అయితే ఇచ్చారో వాటిని తూచా తప్పకుండా అమలు చేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కూడా ఇలానే మరో సంచలన పాలనను అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. ప్రజలు నమ్ముతున్నది వైఎస్సార్ సీపీని మాత్రమేనని, మంచి చేశాం కాబట్టే ప్రజలు వెల్లువలా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో గెలిచేది వైఎస్సార్ సీపీ మాత్రమేనని, ఎవరెన్ని కుట్రలు పన్నినా జగన్ మోహన్‌రెడ్డి గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి టీడీపీలో చేరిన వారిలో మస్తాన్, రాజు, సిద్ధయ్య, గోపి, లక్ష్మి, సరస్వతి ఉన్నారు. కన్నావారి తోట నుంచి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నజీమా బేగం, షేక్ షకీల, షేక్ నాగూర్ బి, షేక్ ఆషాఫున్ , షేక్ ఉష్ణ, చిన్నమ్మాయి, లక్ష్మి, రాధా, షాహినా, నీలు, ధనలక్ష్మి ఉన్నారు.